

1 నుంచి డిగ్రీ ప్రాక్టికల్స్
తెయూ పరిధిలోని డిగ్రీ కళాశాలలకు వచ్చే నెల 1వ తేదీ నుంచి 7 వరకు ప్రాక్టికల్స్ జరుగుతాయని కంట్రోలర్ అరుణ పేర్కొన్నారు.
- 8లో ▸



జాయింట్ సర్వే పరిశీలన
మోస్రాలో ఫారెస్ట్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న జాయింట్ సర్వేను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు పరిశీలించారు.
- 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 37.4 /26.2
ఆకాశం ఉదయం నిర్మలంగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం చల్లటి గాలులు వీయవచ్చు. వర్షం కురిసే సూచనలున్నాయి.

న్యూస్‌రీల్

మెరిసిన బీసీ గురుకులాలు

- 9 స్కూళ్లలో వందశాతం ఉత్తీర్ణత

నిజామాబాద్ అర్బన్ : జిల్లాలోని బీసీ గురుకుల పాఠశాలల విద్యార్థులు పదవ తరగతి ఉత్తమ ఫలితాలు సాధించారు. జిల్లావ్యాప్తంగా 780 మంది పరీక్షలు రాయగా 767 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో వర్ని, రాంపూర్, చీమన్‌పల్లి, నిజామాబాద్ అర్బన్, నూత్‌పల్లి, ఆర్మూర్, అర్బన్ బాలురలు, కంజర గురుకుల పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణత సాధించారు. నిజామాబాద్ అర్బన్ బాలికలలో ముగ్గురు విద్యార్థినులు 10జీపీఏలు సాధించారు. బాల్కొండ గురుకులలో ఒకరు, నిజామాబాద్ అర్బన్‌లో ఒకరు, ఎడపల్లిలో ఒకరు 10 జీపీఏలు సాధించారు. 9.8 జీపీఏలు 19 మంది, 9.7 జీపీఏలు 45 మంది, 9.5 జీపీఏలు 62 మంది సాధించారు.

ప్రత్యేక శిక్షణ కోసం కళాశాలల ఎంపిక

నిజామాబాద్ అర్బన్ : జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశం, ఎంసెట్‌లో ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు కార్పొరేట్ జూనియర్ కళాశాలలను ఎంపిక చేపడుతున్నట్లు సంక్షేమ శాఖ అధికారి శశికళ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల కార్పొరేట్ కళాశాలలు లాగిన్ ద్వారా ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో ఈ నెల 15లోపు నమోదు చేసుకోవలన్నారు.

అన్‌లోడింగ్‌లో వేగం పెంచాలి



సుభాష్‌నగర్ : కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యం లారీలను రైస్‌మిల్లుల్లో అన్‌లోడింగ్ వేగవంతం చేయాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చంద్రప్రకాశ్ సూచించారు. బుధవారం నగరశివారులోని పలు రైస్‌మిల్లులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చంద్రప్రకాశ్ మాట్లాడుతూ హమాలీల సంఖ్య పెంచుకుని లారీల అన్‌లోడింగ్ త్వరగా చేపట్టాలన్నారు. లేకుంటే కొనుగోలు కేంద్రాల వద్ద లారీల కొరత ఏర్పడుతోందని, రైతులు గగ్గోలు పెడుతున్నారన్నారు. అలాగే 17 తేమశాతం ఉన్న ధాన్యాన్ని పంపించాలని, అధిక తేమశాతంతో కూడిన ధాన్యం వస్తుందని సెంటర్ ఇన్‌చార్జీలకు తెలియజేశామన్నారు. మొలకెత్తిన, రంగు మారిన ధాన్యం విషయంలో త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశముందని పేర్కొన్నారు. కడ్తా తీస్తే కఠినచర్యలు తప్పవన్నారు.

సాహిత్య మహాసభ సక్సెస్ కావాలి




నిజామాబాద్ సిటీ : ఈనెల మే 31న హరిదా రచయితల సంఘం నిర్వహించనున్న సాహిత్య మహాసభ సక్సెస్ కావాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆకాంక్షించారు. బుధవారం అర్బన్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో సాహిత్య మహాసభకు సంబంధించిన పోస్టర్లను అర్బన్ ఎమ్మెల్యే గణేష్ బిగాల, మేయర్ నీతూ కిరణ్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ ప్రజల చైతన్యంలో సాహితీవేత్తల పాత్ర గణనీయమైనదన్నారు. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో 'సామరస్య జీవనంలో సాహిత్యవేత్తల కర్తవ్యం' అనే థీమ్‌పై జరిగే ఈ కార్యక్రమంలో సాహితీవేత్తల సందేశాలు, ప్రముఖ గజల్ కవి, గీత రచయిత నరసింహారెడ్డికి పురస్కార ప్రదానం, జిల్లాస్థాయి హరిదా సాహిత్య పురస్కారాల ప్రదానం తదితర కార్యక్రమాలుంటాయని, ఆత్మీయ అతిథిగా సాహిత్య అకాడమీ అధ్యక్షుడు జూలూరి గౌరీ శంకర్ పాల్గొంటారని హరిదా రచయిత ల సంఘం అధ్యక్షుడు ఘనపురం దేవేందర్ వివరించారు. సంస్థ ప్రతినిధులు డాక్టర్ కాసర్ల నరేష్ రావు, నరాల సుధాకర్, తిరుమల శ్రీనివాస్, ప్రసాద్ తదితరులున్నారు.

తగ్గిన ఫలితం..

ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం గతేడాది కంటే తగ్గింది. అయితే బాలికలు మాత్రం ఫలితాల్లో ముందంజలో ఉన్నారు. ఇంటర్‌లో లాగా ఎస్సెస్సీలోనూ బాలికలు విజయకేతనం ఎగురవేశారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారు.

- ఎస్సెస్సీలో 87 శాతం ఉత్తీర్ణత
- బాలికలు 88.21, బాలురు 86.05 శాతం ఉత్తీర్ణత
- 163 స్కూళ్లలో వంద శాతం ఉత్తీర్ణత
- 153 మందికి 10 జీపీఏ
- రెండు పాఠశాలల్లో జీరో పర్సంటేజీ
- 21వ స్థానంలో నిలిచిన జిల్లా..



నిజామాబాద్‌అర్బన్ : ఈ ఏడాది పదవ తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం తగ్గింది. గతేడాది 92.84 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా 87.12 శాతానికి ఉత్తీర్ణత పడిపోయింది. ఎప్పటి లాగే ఫలితాల్లో బాలికలదే పైచేయి సాధించారు. ఈ ఏడాది పదవ తరగతి పరీక్షలకు 21,592 మంది పరీక్షలకు హాజరు కాగా 18,810 మంది ఉత్తీర్ణులయ్యారు. 87.12 శాతం నమోదైంది. ఇందులో బాలురు 10, 924 పరీక్షలకు హాజరుకాగా 9.400 మంది ఉత్తీర్ణులయ్యారు. 86.05 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బాలికలు 10,668 మంది పరీక్షలకు హాజరుకాగా 9,410 మంది ఉత్తీర్ణులయ్యారు. 88.21 శాతం నమోదైంది.

ఎడపల్లిలోని ఠాణాకలాన్‌లో..

జిల్లాలోని పదో తరగతి ఫలితాల్లో 163 పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఇందులో ఆశ్రమ పాఠశాల, మోడల్ స్కూల్ వంద శాతం ఉత్తీర్ణత వచ్చింది. ఆరు కేజీబీవీ పాఠశాలలు, తొమ్మిది మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలలు, 62 ప్రైవేట్ పాఠశాలలు, మూడు రెసిడెన్షియల్ పాఠశాలలు, మూడు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్, ఐదు మైనార్టీ రెసిడెన్షి యల్, 73 జిల్లా పరిషత్ పాఠశాలల్లో వంద శా తం ఉత్తీర్ణత వ చ్చింది. జిల్లా కేంద్రంలోని రెడియంట్ హైస్కూల్‌లో, ఎడపల్లిలోని ఠాణాకలాన్ జిల్లా పరిషత్‌లో జీరో శాతం ఉత్తీర్ణత నమోదైంది.

జిల్లాలో 153 మంది విద్యార్థులు 10 జీపీఏలు సా ధించారు. ఇందులో రెండు ఎయిడెడ్ పాఠశాలలు, రెండు బీసీ వెల్ఫేర్ పాఠశాలలు, ఏడు మాడల్ స్కూళ్లు, 122 ప్రైవేట్ పాఠశాలలు, రెండు రెసిడెన్షియల్ పాఠశాలలు, మూడు మినీ రెసిడెన్షియల్ పాఠశాలలు, 8 సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలు, ఏడు జిల్లా పరిషత్ పాఠశాలలు ఉన్నాయి.

జిల్లాలో..

పాఠశాలలు	రాసినవారు	పాసైనవారు
జిల్లా పరిషత్	7,236	6,043
ఎయిడెడ్	479	367
బీసీ వెల్ఫేర్	452	445
ప్రభుత్వ స్కూళ్లు	970	563
కేజీబీవీ	801	670
మోడల్	984	928
ప్రైవేట్ స్కూళ్లు	8,333	7,572
రెసిడెన్షియల్	232	232
మినీ రెసిడెన్షియల్	809	758
సోషల్ వెల్ఫేర్	1,205	1,111

మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో..

జిల్లాలో మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో నిజామాబాద్ బాలురలు, బాల్కొండ బాలురలు, ఆర్మూర్ బాలికలు, బాల్కొండ బాలికలు , రెంజల్ బాలికలు పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. బాల్కొండ, రెంజల్ పాఠశాల్లో విద్యార్థులకు 10జీపీఏలు వచ్చాయి. జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో 87 శాతం ఉత్తీర్ణత నమోదైంది. 131 మంది విద్యార్థులకుగాను 114 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందల్వాయిలో 72 మందికిగాను 62 మంది పాసయ్యారు. చీమన్‌పల్లిలో 59 మందికిగాను 52 మంది పాసయ్యారు.

ఎస్సీ గురుకులాల్లో ఉత్తమ ఫలితాలు

నిజామాబాద్ అర్బన్ : జిల్లాలోని ఎస్సీ గురుకుల పాఠశాల విద్యార్థులు పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించారు. ధర్మారం పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత నమోదైంది. సుద్దపల్లిలో వంద శాతం ఉత్తీర్ణత నమోదైంది.

667 మంది పరీక్షలు రాయగా 649 మంది పాసయ్యారు. 97.3 శాతం న మోదైంది. ధర్మారం పాఠశాలలో ఇద్దరు, కంజర, నందిపేటలో ఒక్కొక్కరు 10 జీపీఏ సాధించారు.

జూన్ 14 నుంచి సప్లిమెంటరీ..

పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలను జూన్ 14 నుంచి 22 వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు వరకు పరీక్షలను నిర్వహిస్తామన్నారు. పరీక్ష ఫీజు ను విద్యార్థులు ఈనెల 26వ తేదీలోపు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రీకౌంటింగ్ పొందాలనుకునేవారు 15 రోజులలోపు ప్రతి సబ్జెక్టుకు రూ.500 చెల్లించి దరఖాస్తు చేసుకోవలన్నారు. రీవెరిఫికేషన్ కో సం సబ్జెక్టుకు రూ.1,000 చొప్పున చెల్లించవల్సి ఉంటుందన్నారు.

ఆటోడ్రైవర్ కుమార్తెకు 10 జీపీఏ..



నగరంలోని న్యాల్‌కల్ రోడ్డులోగల రోటరీనగర్‌లో నివాసముండే జ్యోతి, బాల నర్సయ్య కుమార్తె సౌమ్య 10 జీపీఏ పాయింట్లు సాధించింది. బాలనర్సయ్య ఆటో నడుపుతూ కుమార్తెను బోర్గాం(పి) జెడ్పీహెచ్‌ఎస్‌లో చదివిస్తున్నారు. చదువుకునే క్రమంలో ఆర్థిక ఇబ్బందులెదురైనా సౌమ్య కష్టపడి చదివింది. సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నతస్థాయిలో స్థిరపడాలనే లక్ష్యంతో సౌమ్య ముందుకెళ్తోంది. టీచర్లు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే 10 జీపీఏ పాయింట్లు సాధ్యమైందని సౌమ్య తెలిపింది.

రీడింగ్ క్లాస్‌లతో లాభం



ప్రతిరోజు తరగతి బోధన అనంతరం రీడింగ్ తరగతులు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఉదయం, సాయంత్రం వేళ చదివించడంతో సందేహాలు పరిష్కరించుకున్నాను. పరీక్షలు దగ్గరకొచ్చేసరికి అన్ని సబ్జెక్టులు చదివా ను. ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధిస్తా.
– నవ్యశ్రీ, 10జీపీఏ, బీసీ గురుకులం, నిజామాబాద్

టీచర్లు ఎంతో ప్రోత్సహించారు



ప్రతివారంతో పాటు ప్రతినెలా నిర్వహించే టెస్టులు నాకు ఎంతో ఉపయోగపడ్డాయి. ప్రతి సబ్జెక్ట్‌లో సందేహాలు తీర్చి టీచర్లు ఎంతగానో ప్రోత్సహించారు. ఇంటర్‌లో మొదటి ర్యాంకు తెచ్చుకోవాలనేదే నా లక్ష్యం.
– రాధిక, 10జీపీఏ, బీసీ గురుకులం, నిజామాబాద్

సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడతా



సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడతాను. మానాన్న శ్రీనివాస్, ఎల్‌ఐసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కాగా, తల్లి భాగ్యలక్ష్మి గృహిణి. బోర్గాం(పి) జెడ్పీహెచ్‌ఎస్‌లో చదువుకున్నాను. ఐఐటీ సాధించి సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడాలన్నది లక్ష్యం.
– నికేతన్, 10 జీపీఏ, బోర్గాం(పి) జెడ్పీహెచ్‌ఎస్

సమ్మెలోనే జేపీఎస్‌లు



జిల్లాకేంద్రంలో మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న జేపీఎస్‌లు

- రాష్ట్ర కమిటీ ఏకగ్రీవ తీర్మానం
- కొనసాగిన నిరసనలు

సుభాష్‌నగర్ : జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పట్టువీడటం లేదు. తమ న్యాయమైన డిమాండ్లకు ప్రభుత్వం నుంచి సానుకూల ప్రకటన వచ్చే వరకు నిరవధిక సమ్మె కొనసాగించాలని నిర్ణయించారు. బుధవారం పంచాయతీ రాజ్ శాఖ అధికారుల సూచనల మేరకు అన్ని జిల్లాల నుంచి జేపీఎస్ ప్రతినిధులు హైదరాబాద్‌కు వెళ్లారు. అనివార్య కారణాల వల్ల పంచాయతీరాజ్ శాఖ మంత్రి కలవలేకపోయారు. కాగా సమ్మె విరమించి విధుల్లో చేరాలని ఆయన సమాచారమిచ్చినట్లు తెలిసింది.

అనంతరం జేపీఎస్‌లు అక్కడే సమావేశం ఏర్పాటుచేసుకుని అందరి నిర్ణయం మేరకు సమ్మె కొనసాగించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.

విధుల్లో చేరినట్టే చేరి..

ప్రభుత్వం నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో 47 మంది జేపీఎస్‌లు, 30 ఓపీఎస్‌లు, 17 మంది లీవ్‌లో ఉన్న జేపీఎస్‌లు విధుల్లో చేరారు. సమ్మెలో ఉండి నోటీసుల మేరకు 47 మంది విధుల్లో చేరగా, అందులో కొందరు సెలవులో వెళ్లిపోగా, ఒత్తిళ్ల మేరకు మరికొందరు తిరిగి సమ్మెలో చేరినట్లు తెలిసింది. మిగితా 327 మంది జేపీఎస్‌లు రెండ్రోజుల క్రితం నాటి ఉత్తర్వుల మేరకు టర్మినేట్ అయినట్లుగానే భావిస్తున్నామని, ప్రభుత్వం నుంచి కొత్తగా ఎలాంటి ఆదేశాలు రాలేదని జేపీ అధికారులు పేర్కొంటున్నారు.

సమ్మె విరమించాలని..

జేపీఎస్‌ల న్యాయమైన డిమాండ్లపై ఇప్పటికే పలుమార్లు చర్చలు జరిగాయి. బుధవారం కూడా చివరగా చర్చలకు ప్రయత్నించగా, సమ్మె విరమించి విధుల్లో చేరిన వెంటనే చర్చిద్దామని మంత్రి చెప్పినట్లు సమాచారం. దీంతో జేపీఎస్‌లు కొంత అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ సమ్మెను కొనసాగించాలని రాష్ట్ర కమిటీ నిర్ణయం తీసుకోవడంతో గురువారం నుంచి వివిధ రూపాల్లో శాంతియుతంగా నిరసనలు తెలియజేయాలని భావిస్తున్నారు.

మోకాళ్లపై నిల్చొని నిరసన

జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మె బుధవారంతో 13వ రోజుకు చేరుకుంది. జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్‌లో జేపీఎస్‌లు మోకాళ్లపై నిల్చొని నిరసన తెలియజేశారు. సమ్మెకు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ల సురేష్ మద్దతు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

అమరులకు కొవ్వొత్తులతో నివాళ్లు..

జిల్లాలో అమరులైన జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం కొవ్వొత్తులతో నివాళ్లర్పించారు. జేపీఎస్‌లు కొవ్వొత్తులు పట్టుకుని ప్రదర్శించారు.



అమరులకు కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న జేపీఎస్‌లు

నేటి నుంచి విధుల్లోకి జీపీ కారోబార్లు..

సుభాష్‌నగర్ : సమస్యలు పరిష్కరించాలని ఈనెల 5వ తేదీ నుంచి జీపీ కారోబార్లు, సిబ్బంది చేపట్టిన సమ్మెను బుధవారం విరమించారు. ఈమేరకు జిల్లా పంచాయతీ అధికారి జయసుధను కలిసి సమ్మె విరమిస్తున్నట్లు లేఖను అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామ పంచాయతీ కారోబార్లు, సిబ్బంది యూనియన్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్ మాట్లాడుతూ పంచాయతీరాజ్‌శాఖ మంత్రితో ఇటీవల జరిగిన చర్చల్లో సమస్యలు పరిష్కరిస్తామని హామీనిచ్చారని తెలిపారు. 11వ తేదీ నుంచి విధుల్లో చేరుతున్నట్లు పేర్కొన్నారు.



డీపీవోకు లేఖ అందజేస్తున్న జీపీ కారోబార్లు

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి

- ఒక్కసారిగా పెరిగిన కనిష్ట, గరిష్ట ఉష్ణోగ్రతలు
- అక్కడక్కడా అకాల వర్షాలు..!

సుభాష్‌నగర్ : జిల్లా ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇటీవల 20 రోజుల పాటు వర్షాలు కురవగా, రెండ్రోజుల నుంచి కనిష్ట, గరిష్ట ఉష్ణోగ్రతలు పెరిగాయి. బుధవారం గరిష్ట ఉష్ణోగ్రతలు 37.4 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 26.2 డిగ్రీలుగా నమోదయ్యాయి.

ఒకవైపు భానుడు భగభగ మండుతుండగా, మరోవైపు జిల్లాలో అక్కడక్కడ అకాల వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో రెండ్రోజులుగా ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో కూలర్లు, ఏసీల వినియోగం పెరిగింది. ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరగడంతో ఉక్కపోతతో ప్రజలంతా ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే ప్రజలు తట్టుకోలేకపోతున్నారు. 20 రోజుల పాటు వర్షాలు కురవడంతో వాతావరణం కొంత చల్లబడింది. కానీ ప్రస్తుతం రాత్రి, పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి.

వారం రోజుల ఉష్ణోగ్రతలు

తేదీ	గరిష్టం	కనిష్టం	తేదీ	గరిష్టం	కనిష్టం
3న	32.5	22.9	6న	34.3	25.2
4న	33.3	20.5	7న	36.9	26.4
5న	33.9	23.9	8న	37.6	25.7
			9న	38.4	28.7

సీఎం కప్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

సుభాష్‌నగర్ : గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో దాగిఉన్న ప్రతిభ వెలికితీసి, వారిని మరింతగా ప్రోత్సహించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపడుతున్న చీఫ్ మినిస్టర్స్ కప్–2003 పోటీల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశించారు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలు జరగనున్నాయన్నారు. కలెక్టరేట్ నుంచి వీసీ ద్వారా కలెక్టర్ బుధవారం చీఫ్ మినిస్టర్స్ కప్ –2003 క్రీడాపోటీల నిర్వహణతో పాటు నర్సరీలు, ఉపాధిహామీ కూలీలకు పనులు, తదితర అంశాలపై అధికారులు, ఎంపీడీఓలు, ఏపీవోలతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 15, 16, 17 తేదీల్లో మండలస్థాయిలో పురుషులు, మహిళలకు వేర్వేరుగా క్రీడాపోటీలు నిర్వహించి గెలుపొందిన వారిని జిల్లాస్థాయి పోటీలకు పంపాలన్నారు. క్రీడాపోటీల నిర్వహణ కోసం మండలస్థాయి అధికారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసుకోవాలన్నారు. వీటిలో రెజ్లింగ్, బాక్సింగ్ పోటీలకు కేవలం పురుషులను మాత్రమే ఎంపిక చేయాలన్నారు. 22 నుంచి 24వ తేదీ వరకు జిల్లాస్థాయి క్రీడాపోటీలు ఉన్నందున, 18న సాయంత్రం నాటికి మండలాల నుంచి జిల్లాస్థాయికి ఫైనల్ జాబితా అందాలన్నారు. మొక్కలకు సంబంధించి కొన్ని నర్సరీలు అధ్వానంగా ఉన్నాయన్నారు. మరో రెండు మాసాల్లో మొక్కలు నాటాల్సి ఉన్నందున, మొలకెత్తని విత్తనాల స్థానంలో కొత్త మొక్కలు పెంచాలన్నారు. ఎంపీడీవోలు, ఏపీఓలు క్రమం తప్పకుండా నర్సరీలను పర్యవేక్షించాలన్నారు. అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, జెడ్పీ సీఈవో గోవింద్, డీపీవో జయసుధ, డీఎస్‌డీవో ముత్తెన్న తదితరులున్నారు.



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



30-04-2023 న విడుదలైన JEE MAINS 2023 లో నిజామాబాద్ కాకతీయ Dist. 1st Dist. 2nd & Dist. 3rd లే కాకుండా 51 మంది కాకతీయ విద్యార్థులు JEE MAINS లో ALL INDIA ర్యాంకులు



2023 JEE MAINS లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థిని అభినందిస్తున్న డైరెక్టర్ CH. రామోజీరావు

2023 JEE MAINS లో సిద్ధార్థకు 99.61%tile తో Dist 1st, సాయి అక్షయ్ 99.30%tile తో Dist 2nd, సాత్విక్ 98.73%tile తో Dist 3rd ఇవే కాకుండా 14 మంది కాకతీయ విద్యార్థులు 90%tile పైగా సాధించారు. అంతే కాకుండా 51 మంది కాకతీయ విద్యార్థులు JEE, IIT MAINS లో All India ర్యాంకులు సాధించారు. 1139, 2681, 3445, 3516, 6242, 6411, 7647, 7679, 7707, 7825, 8543, 9196, 9386, 9416, 10062, 12791, 16250, 18513, 38281, 48561, ఇలా 51 మంది కాకతీయ విద్యార్థులు JEE, IIT MAINS All India ర్యాంకులు సాధించారు. వీరు అందరు కాకతీయలో మార్చి 2023 లో ఇంటర్ పరీక్షలు వ్రాసి తొలి ప్రయత్నంలోనే సాధించిన ALL INDIA ర్యాంకర్లు. Long term ద్వారా తెచ్చుకున్న ర్యాంకులు కాదని కాకతీయ డైరెక్టర్ Ch. Ramoji Rao తెలిపారు.

2023 ఇంటర్ ఫలితాలు: ఈ రోజు విడుదల చేసిన ఇంటర్ ఫలితాలలో 1000 మార్కులకు 989, 989, 988, 988, 988, 987, 987, 986, 986, 985, 985, 985, 984, 984, 984, 983, 983, 983, 983, 983, 982, 982, 982, 982, 982, 981, 981, 981, 981, 980, 980, 980 సాధించారని తెలియచేయుటకు సంతోషిస్తున్నాము.

★ తెలంగాణ విద్యాశాఖ మంత్రి ఇంటర్ మార్కులకు EAMCET Weightage తీసివేసినారు. మన విద్యార్థులు అందరు Direct గా ప్రవేశ పరీక్షలు వ్రాసి IIT గాని, IIIT గాని, NIT లో గాని, Deemed University లో గాని, ఇంజనీరింగ్ కోర్సుల్లో, డాక్టర్ కోర్సులో కాని సీటు తెచ్చుకోవాలని డైరెక్టర్ Ch. Ramoji Rao తెలిపారు. భవిష్యత్తులో ఇంటర్ మార్కులు కేవలం ప్రవేశ పరీక్షలకు Eligibility గానె భావించాల్సి వస్తుందని, మా కాకతీయ విద్యాసంస్థ యొక్క ధ్యేయం, లక్ష్యం, గమ్యం అంత IIT / Medical / EAMCET ప్రవేశ పరీక్షల మీద మా Concentration చెయ్యడమేనని, తల్లిదండ్రులు కూడా జాతీయ ప్రవేశ పరీక్షలైన IIT / Medical / EAMCET పైన Concentrate చెయ్యగలరని కాకతీయ విద్యా సంస్థ డైరెక్టర్ Ch. Ramoji Rao తెలిపారు - కాకతీయ విద్యా సంస్థలు, నిజామాబాద్.

క్లుప్తంగా

బోధన్‌ నుంచి మద్నూర్‌ వరకు నాలుగు లేన్ల రోడ్డు



బోధన్‌: బోధన్‌ పట్టణ కేంద్రం నుంచి రుద్రూర్‌ మీదుగా జుక్కల్‌ నియోజకవర్గంలోని మద్నూర్‌ వరకు రోడ్డును విస్తరిస్తూ 38 కిలోమీటర్ల మేర నాలుగు లేన్ల రోడ్డు మంజూరైంది. జాతీయ రహదారి 63వ నంబరుకు అనుసంధానంగా రోడ్డు విస్తరిస్తూ నిర్మాణం చేపట్టనున్నారు. బుధవారం హైదరాబాద్‌లో మంత్రి ప్రశాంత్‌రెడ్డిని ఎంపీ బీబీ పాటిల్‌ కలిశారు. జహీరాబాద్‌ ఎంపీ బీబీ పాటిల్‌ నాలుగు లేన్‌ల రోడ్డు నిధుల మంజూరుకు కేంద్ర మంత్రి నితిన్‌ గడ్కరీని పలుమార్లు లేఖలు రాశారని మంత్రి ప్రశాంత్‌రెడ్డి అభినందించారు. రూ.750 కోట్లతో రోడ్డు విస్తరణ చేపట్టనున్నారని పేర్కొన్నారు.

స్త్రీనిధి రుణ వాయిదాల చెల్లింపుల్లో చేతివాటం

నాగిరెడ్డిపేట: మండలంలోని కిచ్చన్నపేట గ్రామంలో మహిళాసంఘాలకు సంబంధించి సభ్యులు తీసుకున్న స్త్రీనిధి రుణ వాయిదాల చెల్లింపుల్లో కొంతమంది ఐకేపీ సిబ్బంది చేతివాటం ప్రదర్శించినట్లు తెలిసింది. గ్రామంలోని మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న స్త్రీనిధి రుణానికి వాయిదాల డబ్బులు ఐకేపీ సిబ్బందికి ఇవ్వగా వారు అందులో కొంతనగదును స్త్రీనిధి ఖాతాలో జమచేసి మిగతా డబ్బులను సొంతానికి వాడుకున్నట్లు సమాచారం. కాగా గ్రామంలోని ఓ సభ్యురాలు తాను తీసుకున్న రుణం మొత్తం కంటే అధికంగా వాయిదాలు చెల్లిస్తున్నట్లు గుర్తించి రెండునెలల క్రితం మండలకేంద్రంలోని ఐకేపీ కార్యాలయానికి వెళ్లి ఆరా తీయగా తాము మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని చెప్పినట్లు తెలిసింది. కాగా స్త్రీనిధి వాయిదాల చెల్లింపుల్లో అవకతవకలు జరిగినట్లు గుర్తించిన గ్రామంలోని మహిళాసంఘాల సభ్యులంతా వారు చెల్లించిన స్త్రీనిధి వాయిదాలకు, ప్రస్తుతం ఉన్న బకాయిలను చూసుకోగా గ్రామంలో చాలామంది చెల్లించిన వాయిదాలలో కొంతడబ్బును ఐకేపీ సిబ్బంది నొక్కేసినట్లు తెలిసింది. సుమారు రూ.లక్ష వరకు తేడా వచ్చినట్లు గ్రామస్తులు గుర్తించారు. ఈ విషయం మండల ఐకేపీ అధికారుల దృష్టికి సైతం వెళ్లింది. అయినా ఈ విషయమై విచారణ జరిపేందుకు అధికారులు వెనుకాడడంపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రైతులకు నష్టం



భీమ్‌గల్‌: వరి ధాన్యాన్ని తూకం వేసిన తర్వాత వెంటనే తరలించకపోవడంతోనే రైతులకు నష్టం జరిగిందని జిల్లా కాంగ్రెస్‌ కమిటీ అధ్యక్షుడు మానాల మోహన్‌ రెడ్డి అన్నారు. బుధవారం కారేపల్లిలో వరి ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంగళవారం కురిసిన భారీ వర్షాలకు కారేపల్లి, దేవక్కపేట్‌ గ్రామాల్లో కల్లాల్లో ఉన్న వరి ధాన్యం పూర్తిగా తడిసిపోయిందని, పది రోజుల క్రితం తూకం వేసిన ధాన్యం బస్తాలు కూడా తడిసిపోయాయని అన్నారు. రైతులకు జరిగిన నష్టానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు.

పది ఫలితాల్లో సత్తా





విద్యార్థులను అభినందిస్తున్న ఎస్‌ఆర్‌ పాఠశాల యాజమాన్యం, విశోదయ పాఠశాలలో..



సేయింట్‌ జేవియర్స్‌ పాఠశాలలో..

నిజామాబాద్‌అర్బన్‌: పదో తరగతి ఫలితాల్లో ప్రైవేట్‌ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. జిల్లా వ్యాప్తంగా 8,333 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 7,572 మంది పాసయ్యారు. 62 పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి.

'విజయ్‌'కేతనం..

నగరంలోని విజయ్‌ హైస్కూల్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. 16 మంది విద్యార్థులకు 10జీపీఏలు వచ్చాయి. పాఠశాలకు చెందిన అర్థిత, భవగ్న, హాసిని, కె హాసిని, బి రుషిక, కె సహన, సహస్రరెడ్డి, శ్రీవర్ణ, శ్రీవర్షిణి, సౌమిత్రి, తదితరులు 10 జీపీఏలు సాధించారు. వీరిని పాఠశాల కార్యదర్శి అమృతలత సన్మానించారు.

ఎస్‌ఆర్‌ పాఠశాల జయభేరి

నగరంలోని ఎస్‌ఆర్‌ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారు. పాఠశాలకు చెందిన 16 మంది విద్యార్థులు 10 జీపీఏలు సాధించారు. కళాశాల అధ్యాపక బృందం, జోనల్‌ ఇన్‌చార్జి ప్రణీత్‌కుమార్‌ విద్యార్థులను అభినందించారు.

'అభ్యాస' విద్యార్థుల ప్రతిభ

నగరంలోని అభ్యాస పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత వచ్చింది. పాఠశాలకు చెందిన అరుణ్‌, వెంకట గణేష్‌, వర్షిణి, మాధవి, నాగశ్రావ్య, యశస్విని 9.8 గ్రేడ్‌లు సాధించారు. వీరిని పాఠశాల కరస్పాండెంట్‌ శ్రీనివాస్‌ అభినందించారు.

నలంద పాఠశాలలో..

నలంద పాఠశాల విద్యార్థులు పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించారు. పాఠశాలకు చెందిన శ్రావణి, మహ్మద్‌ అబ్దుల్‌ రహిమాన్‌ 10జీపీఏ సాధించారు. అనురాధ, తేజశ్రీ 9.8 సాధించారు. వీరిని కరస్పాండెంట్‌ మురళీకృష్ణ అభినందించారు.

విశ్వభారతి విద్యాలయంలో..

నగరంలోని విశ్వభారతి విద్యాలయంలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. గీతిక, వరుణ్‌రెడ్డి, వర్ధన్‌ 9.5 జీపీఏ సాధించారు. వీరిని కరస్పాండెంట్‌ శ్యాంసుందర్‌రెడ్డి అభినందించారు.

సేయింట్‌ జేవియర్స్‌ పాఠశాలలో..

నగరంలోని సేయింట్‌ జేవియర్స్‌ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారు. 95 శాతం ఉత్తీర్ణత నమోదైంది. భార్గవి 9.3 జీపీఏలు సాధించారు. విద్యార్థులను పాఠశాల చైర్మన్‌ నర్సింగ్‌రావు సన్మానించారు.

రాఘవ హైస్కూల్‌లో వంద శాతం ఉత్తీర్ణత

నగరంలోని వినాయక్‌ నగర్‌లోగల రాఘవ హైస్కూల్‌ (ఆర్‌హెచ్‌ఎస్‌) విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. పాఠశాల యాజమాన్యం ప్రవీణ్‌కుమార్‌ విద్యార్థులను అభినందించారు.

పది జీపీఏ సాధించిన విద్యార్థులు



శ్రీవేద శృతిక, ఎస్‌ఆర్‌ పాఠశాల | అక్షిత, ఎస్‌ఆర్‌ పాఠశాల | జి ఆర్థిత, విజయ్‌ హైస్కూల్‌ | సహస్ర రెడ్డి, విజయ్‌ హైస్కూల్‌

మెరిసిన ఇందూర్‌ విద్యార్థులు



ఆర్‌ దివ్యశ్రీ | ఎ రిశ్విత | బి ప్రవీణ్‌కుమార్‌ | జి నందిని | సృజన్‌రెడ్డి



కావేరి

బోధన్‌టౌన్‌: బోధన్‌లోని ఇందూర్‌, విజయ సాయి, వంశీ, మాతృశ్రీ, లయోల పాఠశాలలు పదో తరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించాయి. పట్టణంలోని ఆచన్‌పల్లిలోగల ఇందూర్‌ మోడల్‌ ఉన్నత పాఠశాల విద్యార్థులు పది ఫలితాల్లో అత్యధిక జీపీఏ పాయింట్లు సాధించి మెరిశారు. ఆర్‌ దివ్యశ్రీ, ఎ రిశ్విత 10 జీపీఏ, బి ప్రవీణ్‌కుమార్‌, జి నందినీ, సృజన్‌రెడ్డి, కావేరి 9.8 జీపీఏ సాధించారు. ఏడుగురు విద్యార్థులు పి నేహ, కె అవంతిక, డి రొబిష్న, సాయిచరణ్‌ రెడ్డి, అరవింద్‌, సుమంత్‌, సాహితి 9.7 జీపీఏ సాధించి ప్రతిభ కనబరిచారు. అత్యధిక జీపీఏ పాయింట్లు సాధించిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్‌ కోడాలి కిశోర్‌కుమార్‌ అభినందించారు.

ప్రుడెన్స్‌ ఆస్పత్రి ప్రారంభం



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న స్పీకర్‌ పోచారం, ఎమ్మెల్సీ కవిత



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే బిగాల

నిజామాబాద్‌ సిటీ: నగరంలో శ్రీనగర్‌ కాలనీలో ఏర్పాటు చేసిన ప్రుడెన్స్‌ ఆస్పత్రిని స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రారంభించారు. అర్బన్‌ ఎమ్మెల్యే గణేశ్‌ బిగాల జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ ఎంపీ కేఆర్‌ సురేష్‌రెడ్డి, జిల్లా పరిషత్‌ చైర్మన్‌ దాదాన్నగారి విఠల్‌రావు, మేయర్‌ దండు నీతూ కిరణ్‌, డిప్యూటీ మేయర్‌ ఇద్రీస్‌ఖాన్‌, మహిళా అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్‌ ఆకుల లలిత, కార్పొరేటర్‌ ఆకుల హేమలత, వైద్యుడు కిరణ్‌కుమార్‌ పాల్గొన్నారు.

జాయింట్‌ సర్వేను పరిశీలించిన కలెక్టర్‌



మోస్రా శివారులో సర్వే వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు

రుద్రూర్‌: మోస్రా శివారులో ఫారెస్ట్‌, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా నిర్వహిస్తున్న సర్వేను బుధవారం కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు పరిశీలించారు. 952 సర్వే నంబర్‌లో పట్టా భూములు ఉన్నప్పటికీ ఈ ప్రాంతం ఫారెస్ట్‌ లొకేషన్‌లో చూపిస్తుందని గతంలో రైతులు కలెక్టర్‌ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో నిర్వహిస్తున్న జాయింట్‌ సర్వేను కలెక్టర్‌ పరిశీలించారు. పట్టాదారుల నుంచి ఇబ్బందులు తలెత్తకుండా సమగ్రంగా సర్వే చేయాలని అధికారులకు సూచించారు. బోధన్‌ ఆర్డీవో రాజేశ్వర్‌, తహసీల్దార్‌ సాయిలు, జెడ్పీటీసీ విజయ భాస్కర్‌ రెడ్డి, పిట్ల శ్రీరాములు ఉన్నారు.

జూన్‌ 1 నుంచి ప్రాక్టికల్‌ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలలకు సంబంధించి ఈ నెల 22 నుంచి జరగాల్సిన ప్రాక్టికల్‌ పరీక్షలు జూన్‌ 1 నుంచి 7 వరకు జరుగుతాయని కంట్రోలర్‌ ఎం అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ 2వ, 4వ, 6వ సెమిస్టర్‌ రెగ్యులర్‌, 1వ, 3వ, 5వ సెమిస్టర్‌ బ్యాక్‌లాగ్‌ ప్రాక్టికల్‌ పరీక్షలు రాసే విద్యార్థులు మారిన షెడ్యూల్‌ను గమనించాలని ఆమె సూచించారు. అలాగే జూన్‌ 1 నుంచి ప్రారంభం కావాల్సిన సెమిస్టర్‌ పరీక్షలు జూన్‌ 13 నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు.

రోడ్లపై పశువులు వదిలితే చర్యలు

నిజామాబాద్‌నాగారం: నగరంలో ప్రధాన రోడ్లపై ఎక్కడ చూసినా పశువులు దర్శనమిస్తున్నాయని.. పశువుల యజమానులు రోడ్లపై ఆవులు, గేదేలు రాకుండా చూసుకోవాలని నిజామాబాద్‌ మున్సిపల్‌ కమిషనర్‌ చిత్రామిశ్రా ప్రకటనలో తెలిపారు. రోడ్లపై పశువులు తిరగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందన్నారు. పశువులు ప్లాస్టిక్‌ కవర్లు తింటున్నాయన్నారు. అందంగా పెంచుతున్న మొక్కలను సైతం తింటున్నాయన్నారు. అందుకే రోడ్లపై ఆవులు, గేదేలు రానివ్వకుండా చూసుకోవాలన్నారు. లేకపోతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

భిక్కనూరు: మండలంలోని ర్యాగట్లపల్లి గ్రామానికి చెందిన ఒకరు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. గ్రామానికి చెందిన బక్కనగారి మల్లారెడ్డి(45) ఈనెల 7న ఆదివారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

కేజీబీవీల్లో 83.6 శాతం ఉత్తీర్ణత



ఆర్మూర్‌ కేజీబీవీ పాఠశాల భవనం

ఆర్మూర్‌: బాలికా విద్యను ప్రోత్సహించడంలో భాగంగా కొనసాగుతున్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయా(కేజీబీవీ)ల్లో విద్యార్థినులు పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబర్చారు. జిల్లా వ్యాప్తంగా ఐదు కేజీబీవీల్లో వంద శాతం ఫలితాలను సాధించి కేజీబీవీ రికార్డులను తిరగరాసారు. జిల్లాలోని 25 కేజీబీవీలను తెలంగాణ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. పాత, కొత్త మండలాల్లో కలిపి ఉన్న 25 కేజీబీవీల్లో 801 మంది పదో తరగతి పరీక్షలు రాయగా 670 మంది ఉత్తీర్ణులయ్యారు. 83.64 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు డీఈవో దుర్గాప్రసాద్‌, సెక్టోరల్‌ ఆఫీసర్‌ (జీసీడీవో) సింగం వనిత తెలిపారు. జక్రాన్‌పల్లి, ఇందల్వాయి, మెండోర, మోపాల్‌, ముప్కాల్‌ కేజీబీవీల్లో బాలికలు వందశాతం ఉత్తీర్ణతను సాధించారు. జిల్లావ్యాప్తంగా ఒక్క కేజీబీవీ విద్యార్థిని కూడా పది జీపీఏ సాధించలేక పోయారు. ధర్పల్లి కేజీబీవీ 48.48 శాతం ఫలితాలతో చివరి స్థానంలో నిలిచింది. ఈ పాఠశాలలో 33 మంది విద్యార్థినిలు పరీక్ష రాయగా 16 మంది విద్యార్థులు పాసై 17 మంది విద్యార్థులు ఫెయిలయ్యారు.

వచ్చే ఏడాది వందశాతం సాధిస్తాం



జిల్లాలోని కేజీబీవీల్లో విద్యార్థినులు పదో తరగతి పరీక్షల్లో చక్కని ఫలితాలను సాధించారు. రానున్న విద్యా సంవత్సరంలో కేజీబీవీలపై ప్రత్యేక దృష్టి సారించి వంద శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా చర్యలు తీసుకుంటాము. కలెక్టర్‌, డీఈవో సూచన మేరకు అందుకు తగిన ప్రణాళికను ఇప్పటికే సిద్ధం చేసుకున్నాం.

– సింగం వనిత, సెక్టోరల్‌ ఆఫీసర్‌, నిజామాబాద్‌

ఒకే ప్లాటుకు రెండు పట్టాలు

- లబ్ధిదారుల మధ్య నిత్యం ఘర్షణ
- స్పీకర్‌ వద్దకు పంచాయితీ



లబ్ధిదారులకు ఇచ్చిన పట్టాలు

బాన్సువాడ: ప్లాటు ఒక్కటే కానీ పట్టాలు మాత్రం రెండు ఉన్నాయి. ఒక్క ప్లాటు కోసం ఇరువురు లబ్ధిదారులు నిత్యం ఘర్షణ పడుతున్నారు. పట్టాల పంచాయితీ స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌రెడ్డి వరకు చేరింది. కానీ ఇరువురు లబ్ధిదారులు మాత్రం తమకు అదే ప్లాటు కావాలని పట్టుబడడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని బీడీ వర్కర్స్‌ కాలనీలో లబ్ధిదారులకు ప్లాట్లు పంపిణీ చేశారు. బీడీ వర్కర్స్‌ కాలనీ కోసం కొంతమంది రైతుల వద్ద వ్యవసాయ భూమిని ప్రభుత్వం కొనుగోలు చేసి అర్హులైన పేదలకు 2012లో ప్లాట్లు పంపిణీ చేశారు. ఇదే క్రమంలో ప్లాట్ల కోసం వ్యవసాయ భూమిని ప్రభుత్వంకు విక్రయించిన రైతులకు ఒక్కో ప్లాటు ఇస్తామని అధికారులు చెప్పడంతో మూడో విడత ప్లాట్ల పంపిణీలో 23 మంది రైతుల కుటుంబాలకు ఇంటికొక్కటి చొప్పున 23 మంది లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించారు. అయితే రైతులు ప్రభుత్వానికి అమ్మిన వ్యవసాయ భూమి సర్వే నంబర్‌ 370లో 18వ నంబర్‌ గల ప్లాటును 2012 ఆగస్టు 15న దాసరి భాగ్యలక్ష్మీకి కేటాయిస్తూ అధికారులు పట్టా సర్టిఫికెట్‌ ఇచ్చారు. అదే 18వ నంబర్‌ గల ప్లాట్‌ను బండి భూమవ్వ అనే వృద్ధురాలికి కేటాయిస్తు అధికారులు 25 మే 2013లో పట్టా అందజేశారు. ఈ 18వ నంబర్‌ ప్లాట్‌ తమదంటే తమదని భాగ్యలక్ష్మీ, బండి భూమవ్వ నిత్యం ఘర్షణ పడుతున్నారు. బండి భూమవ్వ ఈ నెల 9న స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌ రెడ్డి ఇంటికి వెళ్లి తమకు కేటాయించిన ప్లాట్‌ను ఇంకొకరికి పట్టా సర్టిఫికేట్‌ ఇచ్చారని చెప్పారు. తాను వృద్ధురాలినని, తనకు ఏ ఆధారం లేదని స్పీకర్‌ వద్ద మొర పెట్టుకుంది. దీంతో స్పీకర్‌ వెంటనే తహసీల్దార్‌ గంగాధర్‌కు ఫోన్‌ చేసి ఇద్దరు లబ్ధిదారుల్లో అసలు ఎవరూ అనేది నిర్ధారించి నకిలీ సర్టిఫికేట్‌ కలిగిన వారిపై కేసు నమోదు చేయాలని సూచించారు. ఇరువురు లబ్ధిదారుల మాత్రం పట్టువదలని విక్రమార్కుల్లా ఒక్కరు రేకుల షేడ్డు నిర్మిస్తే మరొక లబ్ధిదారు మట్టి వేసారు. రెవెన్యూ రికార్డుల్లో ఇద్దరి పేర్లు ఉండడంతో అధికారులు ఎవరికి న్యాయం చేయలేకపోతున్నారు. ఈ విషయంపై ఆర్‌ఐ అశోక్‌ను వివరణ కోరగా 2012లో స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని దాసరి భాగ్యలక్ష్మీకి పట్టా ఇచ్చారని, తర్వాత అదే నంబర్‌ ప్లాట్‌ ఇంకొకరి కేటాయించారని చెప్పారు. చుట్టు పక్కల లబ్ధిదారులను విచారించి, రికార్డుల్లో ఎవరి పేరుందో వారికే ప్లాట్‌ ఇస్తామన్నారు.

మల్టీపర్పస్‌ పరిశ్రమలతో ఉపాధి



మాట్లాడుతున్న విక్టోరియా రాష్ట్ర రిటైర్డ్‌ ఇంటెలిజెన్స్‌ చీఫ్‌ జోసఫ్‌

భిక్కనూరు: మల్టీపర్పస్‌ పరిశ్రమల ఏర్పాటుతో నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందని ఆస్ట్రేలియా దేశంలోని విక్టోరియా రాష్ట్ర రిటైర్డ్‌ ఇంటెలిజెన్స్‌ చీఫ్‌ జోసఫ్‌ అన్నారు. బుధవారం మండలంలోని భాగిర్తిపల్లి గ్రామంలో ఆయన పర్యటించారు. పరిశ్రమల ఏర్పాటుకు అనువుగా ఉన్న స్థలాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. పలు రకాల పరిశ్రమలు ఏర్పాటు చేసే వారికి తాను సలహాదారునిగా ఉండి అన్ని విధాలా సహాయపడతారని చెప్పారు. ప్రపంచ దేశాలలో భారతదేశం ఎంతో గొప్పదన్నారు. దేశంలో ఎంతోమంది విద్యావేత్తలు ఉన్నారని వారికి అవసరమైన ఉపాధి లభించడం లేదని తెలిపారు. అలాంటి వారి కోసం మల్టీపర్పస్‌ పరిశ్రమలు ఏర్పాటు కావాల్సిన అవసరం ఉందని చెప్పారు. రాజకీయ నాయకులు తన స్వార్థం కోసం కాకుండా దేశం కోసం ప్రజల కోసం పనిచేయాలని ఆయన సూచించారు. ప్రతి వ్యక్తి ఏదో ఒక పని చేసుకుని తన కుటుంబాలను బాగు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆయన సతీమణి లూజీనా, వ్యాపారవేత్త రవి, అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ రామకృష్ణ, స్థానిక నాయకులు కిష్టయ్య తిరుమల స్వామి, విఠల్‌, పెంటయ్య ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్‌

SERVICES

BUSINESS OFFER

■ ద్వారకా ఎంటర్‌ప్రైజెస్‌: పేపర్‌ ప్లేట్స్‌ & LED మెషీన్స్‌ పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు 100% తిరిగి కొనుగోలు ఒప్పందం, ఫోన్‌: 9310515624, 8800496710 [DA-36266]

OLD AGE HOME

■ మీన్స్‌ వృద్ధుల సేవా సంస్థ నందు వృద్ధులకు, బెడ్‌ పేషెంట్స్‌కు, దీర్ఘవ్యాధులలో ఉన్నా వారికి,మానసిక, శారీరక వికలాంగులకు 24 గం॥ వైద్య, భోజనం, వసతి. ECIL, Hyd. సం ప్ర: 9949520296/7981467036/6281127224. [H-781615]

WANTED

■ Wanted Pre - Primary Teachers (English Mandatory) & Marketing Person's (Female Candidates Only) Edify Pre Primary School, Bodhan. 98483 59580. [Z-799458]

■ ప్రముఖ కంపెనీ నందు మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్‌ టైమ్‌/ఫుల్‌టైమ్‌ పోస్టల్‌ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ / పురుషులు కావలయును. జీతం: 15000 + ఇన్సెంటివ్స్‌. ఫ్రీ బుక్‌లెట్‌ కొరకు 8341371684. [G-786224]

■ లేపాక్షి హెల్త్‌కేర్‌ హైదరాబాద్‌ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్‌/నర్సులు కావలెను ఫ్రీ వసతి+భోజనం. జీ: 18K ఏజెంట్‌ కమీషన్‌ 6K. ఫోన్‌: 9640400073. [HA-148]

■ Hyd లో ప్రముఖ E-కామర్స్‌, ఫార్మా, MNC కంపెనీలకై హెల్పర్స్‌, ప్యాకర్స్‌, సూపర్‌వైజర్స్‌, సెక్యూరిటీ గార్డ్స్‌, కేటరింగ్‌ బాయ్స్‌ కావలెను. రూం, భోజనం ఫ్రీ. జీ. 15,000-30,000. ఫోన్‌ : 9121989924. [HA-11021]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్‌
CONTACT: 9492010949

4 లైన్ల క్లాసిఫైడ్‌ ప్రకటన 200/-రూ॥లు
ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్రైం కార్నర్‌

వరద కాలువలో పడి చిన్నారి మృతి

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లిలోని ఎస్సారెస్పీ వరద కాలువలో పడి మూడున్నరేళ్ల బాలుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన వెల్మ గంగాధర్‌ పెద్దమ్మ కాలనీలో నివాసం ఉంటున్నాడు. బుధవారం ఉదయం ఆయన తల్లి చిత్తు కాగితాలు, తాగి పడేసిన మద్యం సీసాలు ఏరుకోవడానికి వరద కాలువ వద్దకు వెళ్లింది. వెంట మూడున్నరేళ్ల మనవడు లక్కీని తీసుకెళ్లింది. మధ్యాహ్నం వరద కాలువలో నీటిపై తేలియాడుతూ బాలుడి మృతదేహం కనిపించింది. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. బాలుడు ప్రమాదవశాత్తు కాలువలో పడ్డాడా, లేక ఎవరైనా పడేశారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో అనుమానితురాలైన గంగాధర్‌ తల్లిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ ..

జక్రాన్‌పల్లి: మండలంలోని సికింద్రాపూర్‌ సమీపంలో 44వ నంబర్‌ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని కుమ్మరి లక్ష్మీ (50) మృతి చెందారు. ఎస్సై శ్రీకాంత్‌ తెలిపిన వివరాలు.. కేశ్‌పల్లికి చెందిన కుమ్మరి లక్ష్మీ, యాటకర్ల సత్తెమ్మ ఇద్దరు కలిసి పోచంపాడ్‌ గోదావరి స్నానానికి ఇంటి నుంచి బయలు దేరి వెళ్లారు. సికింద్రాపూర్‌ గ్రామం వద్ద 44వ నంబర్‌ జాతీయ రహదారిని దాటుతున్నారు. ఈ క్రమంలో డిచ్‌పల్లి నుంచి ఆర్మూర్‌ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం లక్ష్మీని ఢీకొంది. దీంతో లక్ష్మీ అక్కడికక్కడే మృతి చెందింది. ఆమెకు వరుసకు కూతురైన కొత్తపల్లి లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి ..

ఖలీల్‌వాడి: నగరంలోని వినాయక్‌నగర్‌లోని ఇంద్రాణి స్కూల్‌ వద్ద గుర్తు తెలియని వ్యక్తి ఈ నెల 3న అపస్మారక స్థితిలో ఉండటంతో జీజీహెచ్‌లోకి తరలించినట్లు ఎస్సై సందీప్‌ తెలిపారు. ఆయన చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు చెప్పారు. మృతుడి ఒంటిపై లైట్‌ బ్లూకలర్‌ షర్ట్‌, గ్రే కలర్‌ ప్యాంటు ఉన్నట్లు తెలిపారు.

బాలిక అదృశ్యం

ఖలీల్‌వాడి: నగరంలోని మిర్చి కాంపౌండ్‌కు చెందిన ఓ బాలిక(14) అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఏప్రిల్‌ 24న తన తల్లితో కలిసి బాలిక అహ్మదీబజార్‌లోని జియా హోటల్‌ వద్దకు భిక్షాటన చేయడానికి వచ్చినట్లు చెప్పారు. రాత్రి 8 గంటలకు చాయ్‌ తాగిన తర్వాత గ్లాస్‌ ఇచ్చి వస్తానని చెప్పి వెళ్లిన తన కూతురు తిరిగి రాలేదని తల్లి జబీన్‌ బేగం చెప్పింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రెండో టౌన్‌ ఎస్సై పూర్ణేశ్వర్‌ చెప్పారు.

ముగిసిన తల్లీకుమార్తె అంత్యక్రియలు

మోపాల్‌: డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి శివారులో సీఎంసీ కళాశాల వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కులాస్‌పూర్‌కు చెందిన తల్లీకూతుర్లు నవ్య, సమన్వి అంత్యక్రియలు బుధవారం అశ్రునయనాల మధ్య ముగిశాయి. ప్రమాదంలో స్వల్పంగా గాయపడ్డ రుషి మృతదేహాలకు తలకొరివి పెట్టడం గ్రామస్తులు, బంధువులందరినీ కలిచివేసింది. తీవ్రంగా గాయపడి ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భర్త పోగుల శ్యాంకు విషయం తెలిసి తీవ్రంగా రోధిస్తున్నాడు. వీడియో కాల్‌లో కడసారి భార్య, కూతురును చూయించాలని శ్యాం రోధించగా, వైద్యపరంగా ఏమైనా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముందని వైద్యులు నిరాకరించినట్లు తెలిసింది.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న ఎక్సైజ్‌ పోలీసులు

ఆర్మూర్‌టౌన్‌: బాల్కొండ మండలం పోచంపాడ్‌ వద్ద గంజాయి విక్రయించడానికి వచ్చిన దేవిదాస్‌ను బుధవారం అరెస్టు చేసినట్లు ఆర్మూర్‌ సర్కిల్‌ ఎక్సైజ్‌ సర్కిల్‌ ఇన్‌స్పెక్టర్‌ స్టీవెన్సన్‌ తెలిపారు. ఆదిలాబాద్‌ జిల్లా ఇచ్చోడ మండలం దాబా కే గ్రామానికి చెందిన దేవిదాస్‌ ఆదిలాబాద్‌ పరిసర ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకు వచ్చి పోచంపాడ్‌ ప్రాంతంలో విక్రయిస్తున్నట్లు ఎక్సైజ్‌ పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో బుధవారం ఎక్సైజ్‌ పోలీసులు దేవిదాస్‌ను పట్టుకుని అతని వద్ద నుంచి 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు. దాడుల్లో సబ్‌ ఇన్‌స్పెక్టర్లు గంగాధర్‌, ప్రమోద్‌, చైతన్య, చంద్రమౌళి, హెడ్‌ కానిస్టేబుళ్లు సాయిబాబా గౌడ్‌, దేవిదాస్‌, సందీప్‌ పాల్గొన్నారు.

చోరీ కేసులో ఒకరు..

నాగిరెడ్డిపేట: మండలంలోని రామక్కపల్లిలో ఇటీవల జరిగిన చోరీ ఘటనకు సంబంధించి బుధవారం పోలీసులు ఒకరిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ నెల 6న రామక్కపల్లికి చెందిన కట్ట భూమయ్య ఇంటికి తాళం వేసి తన కుటుంబ సభ్యులతో కలిసి గ్రామశివారులోని కొనుగోలుకేంద్రంలో ధాన్యాన్ని ఆరబెట్టడానికి వెళ్లారు. దీనిని గమనించిన ఓ వ్యక్తి భూమయ్య ఇంట్లోకి ప్రవేశించి రూ.6,500 నగదును ఎత్తుకెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ ప్రారంభించారు. రామక్కపల్లికి చెందిన కట్ట కృష్ణ అనే వ్యక్తి భూమయ్య ఇంట్లో దొంగతనానికి పాల్పడినట్లుగా గుర్తించారు. ఈ నేపథ్యంలో కృష్ణను విచారించగా భూమయ్య ఇంట్లో దొంగతనం చేసినట్లుగా అంగీకరించడంతోపాటు రూ.6వేల నగదును అప్పగించినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

పీడీఎస్‌ బియ్యం పట్టివేత

బోధన్‌టౌన్‌: బోధన్‌ ఆచన్‌పల్లిలో మంగళవారం రాత్రి షేక్‌ ఇస్మాయిల్‌ ఇంటిపై ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారులు దాడులు నిర్వహించి 35 బస్తాల పీడీఎస్‌ బియ్యం పట్టుకున్నారు. దాడిలో అధికారులు నిఖిల్‌ రాజ్‌, అశ్వక్‌, ఆర్‌ఐ వరుణ్‌ తదితరులు పాల్గొన్నారు.